# తురాయి చెట్టు

పొద్దుట్నుంచి గాలి వీస్తూనే ఉంది. గాలి వేగం పొగరుబోతు పోట్లగిత్త పరుగు లాగుంది. సులోచన మానస వీణ సరికొత్త రాగాల నాలాపిస్తూనే ఉంది. చూపులు శూన్యంలో తచ్చాడుతున్నాయి. అరవై వసంతాల సవలోకించిన జీవన యానం.

"ఏమి సాధించా?" వని మన స్సాక్షిని ప్రశ్నిస్తూంటే – ఒంటికొమ్మ తురాయి చెట్టు చప్టామీద కాళ్లు కిందికి వేళ్లాడేసి కూచుంది. ఒంటి కొమ్మ పొడగాటి చేతుల్ని చాచి ఆకాశాన్నేదో అడుగుతోంది. దాని రెమ్మలు దిగంబరంగా ఉన్నాయి. ఆలోచనా లోచనాలు గతం అంతరంగ తరంగాలను స్పర్శిస్తున్నాయి.

ఆనాడు... పెళ్లీడుకొచ్చిన అందరు ఆడపిల్లలాగే సులోచన గూడా కలల అలల మీద తేలిపోయింది. పదహారేళ్ల పరువాల వయసులో కోటి కోర్కెలు కొంగులో దాచుకుంది. కొంటె చూపుల భర్తతో కొంగులు ముడేసుకుంది. మూడుముళ్లు, ఏడడుగుల తర్వాత పుట్టింటి ముందు పల్లకి నెక్కి మెట్టింటి చెటు కింది దిగింది.

ఇల్లు... ఇలవేలుపు దేవాలయంలా కనబడింది. గేటు దాటాక ఇంటి ముందున్న తురాయి చెట్టు.... తనలాగే యవ్వన ప్రాధుర్భావంతో తొణకిసలాడు తోంది. ఒంటినిండా రెమ్మలు, ఆకులు – పూలతో నిండు ముత్తయిదువ లాగుంది. కాండముపైన విడిపోయిన రెండు పొడగాటి కొమ్మలు ఆంగ్ల అక్షరము, వి, ఆకారములో, కాండమును కలిపి చూస్తే, వై ఆకారములో కన్నుల పండువ చేశాయి. అదే చెట్టు కింద పల్లకి దిగగానే పైర గాలి పైట కొంగును అదిలిస్తూ స్వాగత గీతం పాడింది. తురాయి. కొమ్మ రెమ్మలను అలవోకగా ఊపేసి చిగురుటాకులతో చిరునవ్వులు రువ్వింది.

నాదస్వరాలు, వేదమంత్రాల సాక్షిగా 'నాతి చరామి' పలికిన భర్త రాఘవరావు తన చిటికిన వేలందుకుంటూ "సులోచనా! నీలాగే ఈ తురాయి చెట్టుగూడా నాకంటే ఇదేళ్లు చిన్నది. నా చదువుసంధ్యలు, దీని నీడలోనే సాగాయి. మనకు మంచి నేస్తం సుమా!" చెవిలో చేప్పాడు.

నిజమేనన్నట్టుగా తురాయి కొమ్మ తల ఊపింది. ఆ ఊపునకు ఆకులు పూలు తలంబ్రాలై తలమీద వాలాయి. ఎర్రని పూరేకులు వేలెడంత కాడతో ఎదలో పులకింతలు రేపాయి.

అల్చిప్పల్లాంటి కళ్లను అలవోకగా తిప్పేస్తూ ఆడబిడ్డ గుమ్మానికి అడ్డంగా నుంచుండి "మా అన్నయ్య పేరు చెప్పి లోపలికి రావాలి" అంది. మనసులో మల్లెల వన కురిసింది. బుగ్గలనిండా సిగ్గుల ఛాయలు గొంతును పెగలనివ్వ లేదు, భుజానికి భుజం ఒరుసు కుంటూంటే భర్త...

"నా పేరు రాఘవరావు... తెలుసుగదా! చెప్పెయ్!" చెవిలో ఊదాడు. బుగ్గలమీది సిగ్గులు ఒళ్లంతా పాకాయి. పేరు చెప్పేదాకా పిసరంతైనా రాజీపడలేదు.



ఐతా చంద్రయ్య

కమ్మని కాపురం, తియ్యని అనుభవాలు. రాఘవరావు ప్రేమాభిమా నాలు.. వెల్లువలై పొంగాయి. కాలమెలా గడిచిందో తెలీదు. కూతురు భార్గవి జన్మించే సరికి తురాయి చెట్టు కండము కొమ్ములు, రెమ్మలు మరింతగా ఎదిగాయి. రెమ్మల చివరలు పక్కింటి బంగళా డాబాలకు గొడుగులు పట్టాయి. బ్రహ్మచర్యం లో బక్కపలుచగా ఉన్న తన ఒళ్ళు లావెక్కి నిండు వసంతములో దండిగా పూచిన మావిగున్నలా తయారైంది. ఇద్దరు కొడుకుల ముద్దుముచ్చట్లు ఇంటినిండా వెలుగులు పరిచాయి. పక్కింటి డాబాల మీదికి విస్తరించిన తురాయి పూలు సూర్యోదయ సమయములో కాషాయ కాంతులు విరజిమ్మాయి. ఆ సుమ సౌందర్యం కన్యాకుమారిలో సూర్యోదయ దృశాన్ని తలపించేది.

పెద్దకొడుకు రంగారావు అచ్చుగుద్దినట్టు.... వాళ్ళ నాన్న పోలికే. చిన్న కొడకు సత్యంకు వాళ్ల తాత పోలికలొచ్చాయి. సంసారములో సరిగములు పలికిస్తూ పదనిసలుగా సాగిన పదేళ్ల కాపురములో ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలు మురిపాలందించారు. చెట్టుచుట్టూ కట్టించిన చప్టా పిల్లల చదువులకు, దాగుడు మూతల ఆటలకు వేదికగా మారింది. కాని అదే పదేళ్ల కాలము అత్తామామల్ని, అమ్మానాన్నల్ని మింగేసింది.

తన కష్టసుఖాలకు, సుఖ సంతోషాలకు ప్రత్యక్షసాక్షి పచ్చని చెట్టు. ఎదపొదలో కదలాడే సొదలు మౌనభాషలో చెప్పుకుంటుంటే ఎంతో తృప్తి. కొమ్మల రెమ్మల హావభావాలతొ "జీవితమంటే సుఖాల చావడికాదు, కష్టసుఖాల కావడి. మొయ్యడం మనుషుల వంతు, ఫలితాలు పైవాడి. తంతు." జవాబిస్తుంటే ఎంతో ఊరట. కడలికెరటంలాగే ఆగకుండా పరుగెత్తున్న కాలగమనముతో చెట్టాపట్టాలేసుకుని పిల్లలు పెరిగి పెద్దవాళ్లయ్యారు. పాల బుగ్గల, పసిడి నవ్వుల పసిపాపగా తన ఒడిలో, చెట్టునీడలో పొరాడిన భార్గవి పెళ్లిచూపుల కదే చప్టాముందు కుర్చీల్లో మగ పెళ్లివారు ఆసీనులయారు. చప్టా మీద రంగుల జంపుకాన మధ్యన బార్గవి.. అపర భార్గవిలా కనిపించింది. చంపల నిండా సిగ్గుల కెంపులు మెరుస్తూంటే తల నేలకు వాల్చి కూచుంది. వాలుచూపులు మాత్రం పెళ్లికొడుకు నాపాదమస్తకం తడుముతున్నాయి. పరిచయాలు, పరిశీలనలు, ముసిముసి నవ్వుల అల్పాహారాలు ముగిశాక "అమ్మాయి అబ్బాయికి నచ్చింది." ప్రకటన చెవులూ రించింది. అందరి ఆమోదానికి గుర్తుగా జోరుగాలి కెరటం తురాయి కొమ్మనూపేసింది. జలజలా పూలవాన కురిసింది. బార్గవి కిలకిలా నవ్వింది. అందరి గుండెల్లో వెన్నెల జల్లుకురిసింది.

పెళ్లి రంగ రంగ వైభోగంగా జరిగింది. దోర వయసు, ఓర చూపులతో నూతన వధూవరులు చెయ్యేసి చెట్టుకింద కారెక్కారు. పూవులా చేతిలో పెరిగిన బార్గవి అత్తింటికెళ్లేముందు చెట్టు కాండాన్ని ప్రేమగా తడిమి ముద్దుబెట్టుకుంది.

"తురాయి తల్లీ! వెళ్లొస్తానమ్మా! అమ్మా నాన్నల్ని తమ్ముల్ని చల్లగా చూస్తావుగదూ!" అంటూంటే అందరి అంతరాళాల్లో అష్టమ సముద్రం పొంగి కళ్లల్లో మంచుపూలు పూయించింది. కొడుకుల వ్యాపారాలు, కోడల్ల రాక.... మనవడు, మనవరాలు.. అంతా మామూలే. ఆరోజు.... భర్త రంగారావు భారంగా కారు దిగి, చిన్న పిల్లాడిలా అడుగులేస్తూ నీరసంగా లోపలికొచ్చాడు.

"సులోచనా! ఛాతీలో... ఎడమవైపు నొప్పి" అంటూ సోఫాలో ఒరిగాడు. మెలికలు తిరిగిపోతున్నాడు. తన గుండెల్లో గుండ్రాయి దొర్లింది. "ఏమైందండీ?" అడుగుతూ అతని తలను ఒడిలోకి తీసుకుంది. అరచేత్తో గుండెమీద రాస్తూ "మీకేమైందండీ?" మరోసారి అడిగింది.

"ఏమో! గుండెల్ని సూదులతో పొడుస్తున్నట్టుంది. పిపి..... పిల్లలేరి?" గొంతు గురగురలాడింది. దీనంగా తన చేతులందుకున్నాడు.

"వాళ్ళింకా రాలేదు. హాస్పిటల్‌కెళ్దామండీ," ఆందోళన ఆకాశాన్నంటింది. రాఘవరావు అల్లాడిపోతూనే ఉన్నాడు. ఒళ్లంతా చెమటలు పట్టేసింది. మొహం దీనంగా, వాడిన పూవులా మారిపోయింది. కోడళ్లొచ్చారు. పరిస్థితి గమనించి కొడుకులకు ఫోన్ చేశారు. డ్రైవర్ కారు రెడీ చేశాడు. డ్రైవరు సాయంతో భర్తను కారువరకు తీసుకెళ్తోంది.

"ఇక్కడే.... ఇక్కడనే... ఒరుగుతా...!" అంటూ ఆయన చప్టామీద ఒరిగాడు. చూపులు కొమ్మల మీదున్నాయి.

"అమ్మా.... అబ్బా....!" కేక... పొలికేక... చావుకేక.. అంతే... ఐదు నిమిషాల్లో అంతా ఐపోయింది. గుండెలు బాదుకుంది. గోడు గోడుమంది. కొడుకులు, కోడళ్లు బోర్ మన్నారు. ఇంటినిండా జనాలు....

మూడు ముళ్లేసి, ఏడేడు జన్మల బంధాలను గుర్తుచేస్తూ తన వెంట ఏడడుగులు నడిపించుకుని, జీవితాంతం తోడుగా ఉంటానన్న చెట్టంత మనిషి చెట్టునీడలో కట్టె ఐపోయాడు, తనను ఒంటరిగా వదిలేసి తన దారి తాను చూసుకున్నాడు. అది తీరని బాధ, ఆరని వ్యధ....

"అమ్మా! నాన్న అదృష్టవంతుడు. మేమే అభాగ్యులం. కాని.... నువ్వలా ఉలుకూ లేకుండా నెల రోజులుగా గదికి పరిమితమైపోతే... తమ్ములూ, మరదళ్లు... ఏమైపోవాలి?" కన్నకూతురు భార్గవి కన్నతల్లిలా వీపునిమిరింది. ఊరడింపుగా అడిగింది.

"ఇంకా నాకేం మిగిలింది తల్లీ!" కట్టలు తెంచుకుంటున్న దుఃఖాన్ని కడుపులో అదిమిపెట్టలేక కూతురు ఒడిలో వాలిపోయింది.

"మేమున్నామమ్మా!" చిన్న కొడుకు దీన వదనం.

"అత్తయ్యా! మీరంతగా బాధపడొద్దు. చావుపుట్టుకలు మన చేతిలో లేవుగాదా! బాధ పడి సాధించేదేముంది?" చిన్న కోడలు పెద్దమనిషిలా స్వాంతన వచనాలు పలకింది.

"మళ్లీ నువు మామూలు మనిషివైతేనే మాకు మన శ్శాంతి. నాన్నగారి ఈత్మకు శాంతి...." పెద్దకొడుకు బతిమాలాడు.

"మీరోసారి బయటికొచ్చి చప్టామీద కూచోండత్తయ్యా!" పెద్దకోడలు పెద్ద మనసు.

అవును. తురాయి చెట్టు నా వలపుల తొలిమెట్టు.... మనసు లేచొచ్చింది. మెల్లిగా లేచొచ్చి చప్టా మీద కూచుంది. తలపైకి లేచింది. అరెరే! తురాయి చెట్టు అలా ఐపోయిందేమిటీ? చీడపట్టి కట్టుకొమ్మల లాగైపోయా యెందుకో! పచ్చని ఆకుల నల్లబారుతున్నాయే. ఊర్వశిలాగున్న తరుతరుణి ఉత్తి బిచ్చగత్తెలా... వెలవెలబోతోంది.

"అయ్యో పాపం! చెట్టు అలాగైపోయిందేమిటమ్మా?" కూతురు నడిచింది.

"ఏమోనమ్మా... నాన్న పోయారని అదిగూడా నీరసిస్తుందేమో!"

మనిషికీ, మానుకూ ఏమిటో అనుబంధం! వారం తర్వాత భారవి వెళ్లిపోతూ చెట్టునూ, తననూ మార్చిమార్చి చూసిన చూపులు కడుపులో పేగుల్ని కలెబెట్టాయి. మనవడు, మనవరాలి ఆసరాతో చప్టామీద కూచోగానే మనసు చల్లబడింది.

అల్లుని అడుగులో అడుగేస్తూ వెల్లున్న భార్గవి గిరుక్కు వెనక్కు తిరిగొచ్చి ఒడిలో వాలిపోయింది. చంటిపాపలా గుండెల్లో తలదూర్చి "అమ్మా! నేన్నీ రూపములో చూడలేక పోతున్నామమ్మా!" వెక్కుతోంది.

బొట్టూ.. కాట్టుక, తలనిండా పూలు, పచ్చని పట్టుచీరలో ఆనాటితాను, అలంకరణలేవీ లేకుండా తెల్లని ముతక చీరలో ఈనాడు... ఎంత తేడా! తనమీద తనకే జాలేసింది. చిప్పిల్లిన కళ్లు, చెప్పలేని జ్ఞాపకాలు... గొంతునులుముతున్న బాధ....

"అంతా పైవాడి లీల భార్గవీ!" అల్లుడు భార్గవి భుజాలు పట్టి లేపి కూచోబెట్టాడు. "మావయ్య మంచితనాన్ని మననం చేసుకుంటూ మనం ఆయన ఆత్మశాంతికోసం ప్రార్థించాలి తప్ప ఇంకేమీ చెయ్యలేము గదా! ముందుముందు మనంగూడా ఈ మట్టి మట్టి అయిపోవాల్సిన వారమే గదా!" ఎన్నో నగ్నసత్యాలు వివరించాడు. మనసు తేలికైంది.

సంవత్సరీకం సజావుగానే జరిగింది. అటు పిండప్రదానం జరగ్గానే.. ఇటు కోడళ్ల మనసు పొరలనే పురుగు తొలిచిందోగాని సూటిపోటి మాటలు, గిల్లికజ్జాలు పెరిగాయి. పరిస్థితి... నువ్వా, నేనా దశకు చేరుకుంది.

"గతి లేని సంసారం చెయ్యొచ్చుగాని, సుతిలేని సంసారాన్నీదడం నాతోకాదంటే కాదు." పెద్ద కోడలు భీష్మించుక్కూచుంది. చిన్న కోడలు రాజీపడలేదు. కోడళ్ల కొట్లాట కొడుకుల దాకా పాకింది.

ఇలాగే చూస్తూ ఊరుకుంటే ఇంటి పరువు బజారుపాలై పోతుంది. మనసులు దూరమై మనుషులు కలిసి ఉండే కంటే మనుషులు దూరమై మనసులు కలిసి ఉంటే భవిష్యత్తులో బాగుంటుంది. ఇద్దరినీ నుంచోబెట్టి.

"ఒరేయ్! మీ ఇద్దరిలో ఒకరు ఇంటినుండి వెళ్లండిరా!" గుండె రాయి చేసుకుని చెప్పేసింది.

అందుకోసమే ఎదిరి చూస్తున్నట్టు పెద్దకోడలు

"మీ సలహా చాలా బాగుంది. మేమే వెళ్లిపోతామత్తయ్యా!" వినయం ఒలకబోసింది.

మర్నాడుదయం పెద్దకొడుకు... కోడలు, మనవరాలు సామానులు సర్దుకుని వెళ్లిపోయారు. మనసులోని సుడిగుండాల సవ్వడి బయట పడకుండా ఆశ్వీరదించక తప్పలేదు.

అదేరోజు సాయంత్రం తాను గదిలో కూచుని ఏదో ఆలోచిస్తోంది. చిన్నకొడుకు సత్యం అప్పుడే వచ్చి చాయ్‌సేవిస్తున్నాడు. మనవడు స్కూల్ నుండి వచ్చి యూనిఫారం మార్చుకుంటున్నాడు.

ఫెళ ఫెళ.... ఫెళ... బయట శబ్దం. భయంకరమైన శబ్దం. ఫెళ్ళు ఫెళ్ళు... ఫెళ్ ఫెళ్ ఫెళ్ ఫెళ్.... దిక్కులదురు తున్నాయి. అంతా పరుగెత్తుకొచ్చారు. తురాయి చెట్టు కుడివైపు కొమ్మ కాండముపైకి విరిగిపడిపోయింది. "అబ్బో! అందెత పొడవుందో!

దాని చివరి భాగం పక్కింటి బంగళా మిద్దెమీదుంది. మొదలు చప్టామీదుంది. గొప్ప ప్రమాదమేదో జరిగిపోయినట్టు వీధి జనాలు చుట్టూ మూగారు. ప్రాణ నష్టం జరుగలేదు. అప్పటికదే నయమన్పించింది. కాని.... కుడి భుజం విరిగిపోయిన పెద్దమనిషిలా తురాయి చెట్టు ఒంటికొమ్మతో కన్పించేసరికి ఏదో బాధ మనసును మెలి పెట్టింది.

ఎందుకిలా జరిగింది? ఇన్నేళ్లుగా చల్లని నీడనిచ్చిన చెట్టుకొమ్మ అలా పడిపోవడమేమిటీ?.... గుండెపొరల్ని కత్తితో కోసినంత బాధ.

పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశారెవరో.

"అరెరే! చెట్టు పైకి బాగానే ఉంది గాని, లోలోపల పురుగు తొలిచేస్తున్నట్టుందే!" ఇంటి పక్క పెద్దమనిషి వ్యాఖ్యానం.

"అబ్బో, అది చాలా పాత చెట్టు. నేను పుట్టినప్పట్నుంచి చూస్తున్నా." ఇంటిముందున్న చాయ కొట్టాయన అన్నాడు. "పక్కంటి బంగళా వాళ్లుగూడా అదృష్ట వంతులే. పైన ఎవరాన్న ఉంటే ఆ పిట్ట గోడతో వాళ్ల తలకాయగూడా పగిలేదు."

"ఆ దరిద్రం కొమ్మ మా బంగళామీదనే పడాలా?" బంగళా గలావిడ మూతులూ, ముక్కులతోపాటు చేతులుగూడా తిప్పుతూ కొంగు నడుముకు బిగించుకుంది. మొహం ఎఱ్ఱబారింది. "అదేదో వాళ్లింటి మీదనే పడితే తెలిసేది...."

"అలా మొహాలు చూస్తూ కూచుంటే సరిపోద్దా?" ఆవిడ భర్త లుంగీ పైకి మలుచుకున్నాడు. చిన్న కొడుకు ఉద్యమించాడు. ఫోన్ పిలుపందుకుని పెద్ద కొడుకొచ్చాడు. ఉరుకులు... పరుగులు.... కొమ్మ... పొడగాటి కొమ్మను ముక్కలు చెక్కలుగా నరికారు.

మర్నాడు భార్గవి వచ్చింది. నరికిన కొమ్మ ముక్కల్ని, ఒంటి కొమ్మ తురాయి చెట్టును చూస్తూ వలవలా ఏడ్చేసింది. ఎవరు ఎన్ని రకాల ఊరడించి నా తన మనసు కుదుటబడలేదు.

రోజులు దొర్లిపోతూనే ఉన్నాయి.

ఆరోజు తాను... గదిలో మంచమ్మీద కూచునుంది. దృష్టి... కిటికీ ఊచల్లోంచి పెరట్లోని జామ చెట్టుపైన కేంద్రీ కృతమైంది.

"అమ్మా!" సత్యం పిలుపు. చిన్న పిల్లాడి గొంతు.

"ఏవిట్రా?" దృష్టి ఇటు మళ్లింది.

"మనమీ ఇల్లు అమ్మేస్తున్నామమ్మా."

ఉరుము లేకుండా పిడుగు పడింది.

"అదేమిట్రా?" మంచమ్మీంచి దిగ్గున లేచి నుంచుంది. మనవడు పరుగెత్తుకొచ్చి తనను వేలుబట్టి కూచోబెట్టి, పక్కన కూచున్నడు.

"అదికాదత్తయ్యా!" సత్యం వెనకనుండి వయ్యారంగా ముందుకొస్తూ అంది కోడలు. "ఇల్లు చాలా పాతదైపోయింది. మీ మనవడిని రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పిద్దామనుకున్నాము."

గుండె గూటిలో దూమారం చెలరేగింది. "మరి...నేనూ చాలా పాతదాన్నేగదా! నన్ను గూడా...." అందామనుకుంటే ఏదో శక్తి అడ్డుకుంది.

"అయితే... మరినేనో!" బోర్‌మని ఏడ్వాలనిపించింది.

"కొండపాక శివారులో కొండల మధ్య బ్రహ్మాండమైన వృద్ధాశ్రమ ముందమ్మా!" కొడుకు పెదాలమీద చిరునవ్వు మెరిసింది. అది పుట్టుకొచ్చింది. కాదు పెట్టుకొచ్చిందని అర్థమైంది. "మా ఫ్రెండు నాన్నగారో రిటైర్డ్ ఐ.ఏ.యస్. ఆయన గూడా అక్కడే ఉంటున్నారమ్మా. నేను చూసొచ్చాను. ఏర్పాట్లన్నీ చాలా బాగున్నాయమ్మా."

ఓహో.... అదా సంగతి! అడ్డాలనాటి బిడ్డలు గెడ్డాలనాడు యజమానుల వుతారు. యాజమాని ఆదేశాన్ని అమలుపరచి తీరాలన్నమాట. నేను గూడా ఇల్లు వదిలి ఆశ్రమానికి చేరుకోవాలన్న మాట. ఒంట్లోని రక్తాన్నంతా ఏదో శక్తి పీల్చి పారేస్తున్నట్టనిపించింది. అనుకోని ఆవేశం...

"ఇంత బతుకూ బతికి ఇంటినక చచ్చినట్టు...."

"అక్కడ నలుగురి మధ్య హాయిగా ఉండొచ్చు. మంచి భోజనం, వారం వారం డాక్టర్ వచ్చి హెల్త్ చెక్ చేస్తాడు. అన్ని వసతులన్న గది. పెద్ద పూలతోట, దేవాలయం, చుట్టూరా కొండలు... ప్రకృతి సౌందర్యం కన్నుల పండువుగా ఉందమ్మా."

నిట్టనిలువునా, నివ్వెరబోయింది. వెన్నుపూసలో సన్నని వణుకు, చిరాకు.. కోపం గూడా.

"మ... మరీ... అన్నయ్యేమన్నాడు?"

"అన్నయ్య అభిప్రాయంగూడా అదే. మేమిద్దరం కలిసే ఓ మార్వాడికీ ఇల్లు అమ్మేసి అడ్వాన్సు పుచ్చుకున్నాము."

ఇంకేం!... నా ప్రమేయం లేకుండానే నిర్ణయం జరిగి పోయిందన్నమాట.

"ఇది మీరు కట్టించిన ఇల్లు కాదురా. దీన్ని అమ్మే హక్కు మీకెక్కడిదిరా?" అరవాలనిపించింది. కాని.... ఈ వయసులో ఆరాటం వల్ల అల్లరి తప్ప ఆప్యాయతలు పెరగవు.

"మనమోసారి వెళ్లి ఆశ్రమాన్ని చూసొద్దామా!" అనగలిగింది.

రెండోరోజు కారులో "ఆనంద నందనము" వృద్ధాశ్రమం చేరుకుంది.

పుణ్యాత్ముని హృదయంలా విశాలమైన మైదానము. ధర్మాత్ముని దూరదృష్టిలా ఎత్తైన కొండల మధ్య ప్రశాంత వాతావరణము... భవన సౌందర్యము ఉదాత్త హృదయానికి నిరవ్వచనం చెబుతోంది. గదులు విశాలంగా, నిరాడవబరంగా, నిర్మలంగా ఉన్నాయి. తోట నిండా మెత్తని గడ్డి... పచ్చని పీతాంబరాల పరువు పరిచినట్టుంది. నిర్మల హృదయాల్లా వికసించి తలలాడిస్తున్న రంగుల పూలు పసిపాపల నవ్వుల్ని తలపిస్తున్నాయి. బయటి ప్రపంచాన్ని మరిచి ఒకరికి ఒకరై స్వేచ్ఛా విహంగాల్లా విహరిస్తున్న ఆశ్రమ వాసులు. తనువు హాయిగా నవ్వింది. మనసు పులకించి "ఆనంద నందనము"లోనే హాయిగా ఉంటానంది.

"మా అమ్మ వారంరోజుల్లో వచ్చి చేరుతుందండీ!" మానే జర్‌తో చెప్పేశాడు కొడుకు.

మూడోరోజు.... మనవడిని రెసిడెన్షియల్ స్కూల్లో చేర్చాడు. వాడినక్కడ వదిలేసి తిరిగి వచ్చేముందు.

"నానమ్మా! మళ్లీ ఎప్పుడొస్తావు?" అడిగాడు పసివాడు. ఏమో! తనకే తెలీదు. మనసు మూగవోయింది. చూపులు సత్యంవైపు మళ్లాయి.

"నానమ్మనా! ఎప్పుడంటే అప్పుడొస్తుంది. బాబూ!" కోడలు భరోసా ఇచ్చింది. గుండె బరువెక్కింది. మనవడి నుదురు ముద్దాడి "నాదేముంది రా, నిమిత్త మాత్రురాలిని. నువు బాగా చదువుకో! పెరిగి పెద్దయాక మీ అమ్మానాన్నల్ని వృద్ధాశ్రమానికి వెళ్లమనొద్దుకన్నా" లాలనగా అనేసింది.

పసివాడు నవ్వేశాడు. కొడుకు నిశ్చేష్టుడయాడు. కోడలు రుసరుసలా డింది. ఆ మర్నాడే ఇల్లు అమ్మకం పాత్రాలు రాశారు. ఉదయం... సామానులన్నీ సర్దడమైపోయింది. తాను ఆశ్రమానికి, కొడుకు కొత్తింటికి బయలుదేరాలి.

"అమ్మా! లేవాలమ్మా. సామానులన్నీ లారీలో పంపించాము" సత్యం వచ్చి ముందునుంచున్నాడు. గతం గతః...

"అలాగా!"

"ఆ.... అదిగో కారు. అందులో నీ సూటుకేసుంది. ముందు నిన్ను ఆశ్రమములో దిగబెట్టి మేము కొత్తింటికేళ్దాము."

పొద్దటి గాలి దుమారంగా రూపుదిద్దుకుంటోంది.

సులోచన చప్టామీంచి లేచింది. కుడి చేత్తో కొంగును, ఎడమ చేత్తో గుండెను అదిమి పట్టుకుని తురాయి చెట్టువైపు తిరిగింది.

చెల్లీ! నువు ఒంటి కొమ్మతో ఒంటి దానివైనావు. నేనూ ఒంటరి దాన్నైపోయాను. నీ ఆశల ఆకులు రాలిపోయాయి. నా ఆశయాలు గాలిమేడలైనాయి. విడిపోతున్న మనకిక... పడిపోయే దాకా కొత్త అనుభవాలే గదా!... మనసు మూల్గింది. వెనక్కు తిరిగి కొడుకూ... కోడలు వెంట గేటుదాటింది. గేటుకు తాళం పడబోతోంది. గాలి దుమారం మరింత బలం పుంజుకుంది.

తురాయి చెట్టు ఒంటికొమ్మ చిటపట లాడ్తూ ఊగిసలాడ్తోంది. ఆ శబ్దం జనారణ్యంలో దిక్కూదివాణం లేని అనాధ రోదనలాగుంది.

ఫళ్ ఫెళ్... ఒంటి కొమ్మ... పొడగాటి కొమ్మ ఫడేల్ ఫడేల్ మంటూ ఒరిగి పోయింది. కాండముపైన విరిగి ఇంటి ఒడిలో సేదదీర్చుకుంటోంది. జనాలు మూగారు.... అంతా అయోమయం.....

పాపం! తురాయి చెట్టు... అమాయక ప్రాణి, పైన పటారం... లోనం లొటారం ..... సులోచన గుండె చప్పుళ్లు... ఆమెకు మాత్రమే వినబడుతున్నాయి.

**ఆదివారం ఆంధ్రభూమి 29 ఫిబ్రవరి, 2004**

❖ ❖ ❖ ❖